నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, సోమవారం 29 జూలై 2024 | HYDERABAD

అమ్మవారికి బోనం సమర్పిస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

భక్తులతో కిక్కిరిసిన లాల్‌దర్వాజ సింహవాహిని దేవాలయం

ఇంటిల్లిపాది..సల్లంగా చూడు

నెత్తిన బోనమెత్తి..నైవేద్యం సమర్పించి..

వీధి వీధిలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

అమ్మవారి ఆలయాలకు పోటెత్తిన భక్తులు

కిక్కిరిసిన 'సింహవాహిని'..భక్తిశ్రద్ధలతో మొక్కుల చెల్లింపు

పాతబస్తీలో అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు

చార్మినార్: యాపకొమ్మలు చేతిలో పట్టుకొని.. బోనాలను నెత్తిమీద పెట్టుకొని.. ఆడబిడ్డలు ఆలయాలకు పోటెత్తారు. ఇంటిల్లిపాది సల్లంగా చూడు తల్లి.. అంటూ.. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం భాగ్యనగరంలో బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పుదరువులతో సిటీ బస్తీలన్నీ దద్దరిల్లాయి. ప్రతిష్టాత్మక లాల్‌దర్వాజ సింహవాహిని ఆలయానికి భక్తులు పోటెత్తారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి..మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయం, హరిబౌలి అక్కన్న మాదన్న దేవాలయం, గౌలిపుర భారతమాత అమ్మవారి ఆలయం, మీరాలం మండిలోని శ్రీ మహంకాళేశ్వర దేవాలయంతోపాటు ఉప్పుగూడ మహంకాళి ఆలయాల్లోనూ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సింహవాహిని అమ్మవారికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పట్టువస్త్రాలు సమర్పించారు. హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళి అమ్మవారికి మంత్రి శ్రీధర్‌బాబు, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్‌లతో కలిసి పట్టు వస్త్రాలను అందించారు.

మీరాలం మండి మహంకాళేశ్వర అమ్మవారికి మంత్రి జూపల్లి కృష్ణారావు, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పట్టు వస్త్రాలను సమర్పించారు. సింహవాహిని అమ్మవారికి మంత్రులు శ్రీధర్‌బాబుతోపాటు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, లాల్‌దర్వాజా, మేకల బండ ప్రాంతంలో కొలువుదీరిన నల్లపోచమ్మకు బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు బండా ప్రకాశ్, బల్మూరి వెంకట్, తీన్మార్ మల్లన్న తదితరులు అక్కన్న మాదన్న, సింహవాహిని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

వర్షాకాలంలోనూ నాలా పూడికతీత

952.69 కిలోమీటర్లలో 781.42 కి.మీలో మాత్రమే మట్టి తొలగింపు

సిటీబ్యూరో, జూలై 28 (నమస్తే తెలంగాణ) : నాలా పూడికతీత పనులు మే నెలాఖరు నాటికే పూర్తి కావాల్సి ఉంది. అయితే వర్షాకాలం వచ్చి..జూలై ముగుస్తున్నా.. నేటికీ పనులు కొనసాగుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే గ్రేటర్‌లో నాలా పూడికతీత నిరంతర ప్రక్రియ అని జీహెచ్ఎంసీ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలాల్లో ఫ్లోటింగ్ మెటీరియల్‌తో నిలిచిన నీరు లోతట్టు ప్రాంతాలకు వెళ్లకుండా నియంత్రణకు పూడికతీత పనులను ఏటా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వర్షాకాలంలో ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు ప్రీ మాన్‌సూన్, మాన్‌సూన్ సందర్భంగా, పోస్ట్ మాన్‌సూన్‌లో చేపట్టిన చర్యల్లో భాగంగా డీ సీల్టింగ్ ప్రక్రియతో పాటు వర్షంతో దెబ్బతిన్న వాటికి పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నామన్నారు. జీహెచ్ఎంసీవ్యాప్తంగా మొత్తం వరద కాలువ 1302 కిలోమీటర్లు ఉండగా, అందులో 390 కిలోమీటర్లు మేజర్ నాలా ఉంటుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 56.38 కోట్ల అంచనా వ్యయంతో 201 పనులు 919 కిలోమీటర్ల వరద కాలువను 952.69కిలోమీటర్ల పూడికతీత లక్ష్యంలో.. ఇప్పటి వరకు 781.42 కిలోమీటర్ల మేర పూర్తయినట్లు చెప్పారు. 3.3 లక్షల క్యూబిక్ మీటర్ల ఫ్లోటింగ్ మెటీరియల్‌ను తొలగించి, 85.73 శాతం పూర్తి చేశామన్నారు. అందులో 72.41 శాతం పూడికతీత మట్టిని జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలించినట్లు తెలిపారు.

7న వెబినార్

సిటీబ్యూరో, జూలై 28(నమస్తే తెలంగాణ): ఇండియన్ కౌన్సిల్ మెడిసినల్ రీసెర్చ్ ఆధ్వర్యంలో ఆగస్టు 7న జాతీయ స్థాయి వెబినార్ జరగనున్నది. ఇంప్లీమెంటేషన్ రీసెర్చ్ అంశంపై జరిగే ఈ సదస్సులో ఐసీఎంఆర్‌కు చెందిన ల్యాబోరేటరీ సంస్థలు, వైద్యారోగ్య శాఖలు, ఇతర పరిశోధన సంస్థలకు చెందిన సైంటిస్టులు, నిపుణులు హాజరు కానున్నారు. జీవక్రియలు, అనారోగ్య సమస్యల నియంత్రణలో అందుబాటులోకి వస్తున్న పరిశోధనలపై చర్చించనున్నారు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన 15 మందికిపైగా నిపుణులు ఈ వెబినార్‌లో పాల్గొంటారని ఐసీఎంఆర్ వర్గాలు వెల్లడించాయి.

మెట్రోపై కేసీఆర్ ముందుచూపు

మూడు దశల్లో 414 కి.మీ మేర విస్తరించేలా ప్రణాళికలు

రెండో దశలో 78 కి.మీ తోనే సరిపెట్టిన రేవంత్ సర్కారు

సిటీబ్యూరో : మెట్రో విస్తరణ విషయంలో గత సీఎం కేసీఆర్ ఎంతో ముందు చూపుతో వ్యవహరించారు. మొదటి దశలో పూర్తయిన 69 కి.మీ మెట్రో కారిడార్లను నగరం నలుమూలలా విస్తరించేలా.. రెండు, మూడు దశలకు సంబంధించిన ప్రణాళికలను రూపొందించే బాధ్యత హైదరాబాద్ మెట్రో రైలు సంస్థకు అప్పగించారు. మహానగరంలో పదేండ్లలో 414 కి.మీ మెట్రో నెట్‌వర్క్‌ను విస్తరించాలని నిర్ణయించారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెట్రోపై నిర్లక్ష్యం చూపుతున్నది. అందుకు నిదర్శనం కేవలం 78.4 కి.మీ మెట్రో మార్గాన్ని నిర్మించాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదించిన మెట్రో మార్గాలను పూర్తిగా పక్కన పెట్టి పరిమిత మార్గాల్లోనే కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. అందులోనూ 3 మెట్రో మార్గాలు భవిష్యత్ అవసరాలకు ఏమాత్రం సరిపోవని ఒకవైపు పట్టణ ప్రణాళిక నిపుణులు, మెట్రో అధికారులు చెబుతున్నా పట్టించుకోకుండా మెట్రో విస్తరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

కేసీఆర్ ప్రభుత్వం మెట్రో విస్తరణ ప్రతిపాదనలు

రెండో దశ...

- రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి ఓఆర్ఆర్ మీదుగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు 31 కి.మీ
- నాగోల్ నుంచి ఎల్బీ నగర్ వరకు 5 కి.మీ
- బీహెచ్ఈఎల్ నుంచి గచ్చిబౌలి మీదుగా లక్డీకాపూల్ వరకు 24 కి.మీ
- పెండింగ్‌లో ఉన్న పాతనగర మెట్రో మార్గం 5.5 కి.మీ
- మొత్తం 4 మెట్రో కారిడార్లు కలిపి 67 కి.మీ మేర మెట్రోను విస్తరించాలని నిర్ణయించారు.

మూడో దశ...

ప్యాకేజీ-1 (48 కి.మీ)

- బీహెచ్ఈఎల్- పటాన్‌చెరు-ఓఆర్ఆర్- ఇస్నాపూర్ 13 కి.మీ
- ఎల్బీ నగర్-హయత్‌నగర్-పెద్ద అంబర్‌పేట 13 కి.మీ
- ఓఆర్ఆర్ పటాన్‌చెరు ఇంటర్ చేంజ్- కోకాపేట-ఓఆర్ఆర్ నార్సింగి ఇంటర్‌చేంజ్ 22 కి.మీ

ప్యాకేజీ-2 (94 కి.మీ)

- శంషాబాద్ జంక్షన్ మెట్రో స్టేషన్-కొత్తూరు-షాద్‌నగర్ 28 కి.మీ
- శంషాబాద్ ఎయిర్‌పోర్టు స్టేషన్-తుక్కుగూడ- ఫార్మాసిటీ 26 కి.మీ
- ఓఆర్ఆర్ శంషాబాద్ ఇంటర్‌చేంజ్-ఓఆర్ఆర్ పెద్ద అంబర్‌పేట జంక్షన్ 40 కి.మీ

ప్యాకేజీ-3 (78 కి.మీ)

- ఉప్పల్ ఎక్స్ రోడ్డు- ఘట్‌కేసర్-బీబీనగర్ 25 కి.మీ
- తార్నాక ఎక్స్ రోడ్డు - ఈసీఐఎల్ రోడ్డు 8 కి.మీ
- ఓఆర్ఆర్ పెద్ద అంబర్‌పేట జంక్షన్-ఘట్‌కేసర్- ఓఆర్ఆర్ మేడ్చల్ జంక్షన్ 45 కి.మీ

ప్యాకేజీ-4

- డబుల్ ఎలివేటెడ్ ఫ్లై ఓవర్- జేబీఎస్ మెట్రో రైల్ స్టేషన్ నుంచి తూంకుంట వరకు 17 కి.మీ
- డబుల్ ఎలివేటెడ్ ఫ్లై ఓవర్- ప్యారడైజ్ ఎక్స్ మెట్రో స్టేషన్ నుంచి మేడ్చల్-కండ్లకోయ జంక్షన్ వరకు 12 కి.మీ
- ఓఆర్ఆర్ మేడ్చల్ ఇంటర్‌చేంజ్-దుండిగల్- ఓఆర్ఆర్ పటాన్‌చెరు ఇంటర్‌చేంజ్ 29 కి.మీ

రేవంత్ సర్కారు కొత్తగా చేపట్టిన మెట్రో రెండో దశ

- నాగోల్ నుంచి ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట మైలార్‌దేవ్‌పల్లి మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు 33 కి.మీ
- మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు 14 కి.మీ
- రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి కోకాపేట నియోపోలిస్ లేఅవుట్ వరకు 11.3 కి.మీ
- ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు 8కి.మీ
- ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా మీదుగా చాంద్రాయణగుట్ట ఇన్నర్ రింగు రోడ్డు వరకు 7 కి.మీ
- మైలార్‌దేవ్‌పల్లి నుంచి ఆరాంఘర్ మీదుగా కొత్తగా నిర్మించే హైకోర్టు భవనం వరకు 5 కి.మీ
- రెండో దశలో మొత్తం 78.4 కి.మీ మెట్రో మార్గాన్ని నిర్మించేందుకు రూ.24042 కోట్ల వ్యయం అవుతుందని అంచనాతో పనులు మొదలు పెట్టారు.

రాష్ట్ర టూరిజం శాఖ, ఆగాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ ఆధ్వర్యంలో ఆదివారం కుతుబ్‌షాహీ హెరిటేజ్ పార్కులో జరుగుతున్న పునరుద్ధరణ ప్రాజెక్టు ముగింపు కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వేల సంవత్సరాల నాటి చరిత్ర సంస్కృతి, సంప్రదాయాలతో తెలంగాణ నిండి ఉన్నదని చెప్పారు. శాతవాహనులు, కాకతీయులు, కుతుబ్ షాహీలు, ఇతరులు ఈ ప్రాంతాన్ని పాలించారని, ప్రతి ఒక్కరూ వారి ప్రత్యేకమైన సాంస్కృతిక ముద్రను వేశారని పేర్కొన్నారు. – సిటీబ్యూరో, జూలై 28 (నమస్తే తెలంగాణ)

రాష్ట్ర స్థాయి సకురా జపాన్ సైన్స్ హై స్కూల్ ప్రోగ్రామ్-2024 స్క్రీనింగ్ పరీక్షకు హైదరాబాద్ విద్యార్థి మల్లికార్జున్ ఎంపికయ్యాడు. బోరబండ గురుకుల విద్యాలయం విద్యార్థి మల్లికార్జున్ స్క్రీనింగ్ పరీక్షలో మొదటి స్థానంలో నిలిచి..రాష్ట్ర స్థాయి పరీక్షకు ఎంపికయ్యాడు.

-సిటీబ్యూరో, జూలై 28 (నమస్తే తెలంగాణ)

తేలికపాటి జల్లులు..

జూబ్లీహిల్స్ : ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఆదివారం గ్రేటర్‌లోని పలుచోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. షేక్‌పేట, గచ్చిబౌలి, ఆసిఫ్‌నగర్, మెహిదీపట్నం, గన్‌ఫౌండ్రి, విజయనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం మోస్తరు వర్షాలు కురిశాయి. కాగా, ఉష్ణోగ్రత గరిష్ఠం 30.2, కనిష్ఠం 24.0 డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 66 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.